క్లుప్తంగా

11 నుంచి టీటీసీ పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు ఈ నెల 11 నుంచి 14వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ పి. రామారావు గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడుతాయని, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలో శిక్షణ,ఎంబ్రాయిడరింగ్ పరీక్షలో 41 మంది, డ్రాయింగ్‌లో లోయర్‌లో 178 మంది, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ట్రేడ్‌లో 42 మంది. డ్రాయింగ్ హయ్యర్‌లో 142 మంది, గుమ్ముడూరు బాలికల పాఠశాల్లో ట్రేడ్‌లో 82 మంది, టైలరింగ్ లోయర్‌లో 97 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. వివరాలకు 98497-61012 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన గ్రామస్తులు

చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి గ్రామస్తులు ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని శాసన మండలి బడ్జెట్ సమావేశాల అనంతరం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సమక్షంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు.

జయప్రదం చేయండి

దంతాలపల్లి: ఈనెల 10 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రతి గ్రామంలో తలపెట్టబోయే సభలను నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్ర దం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో పార్టీ శ్రేణులు నిర్వహించిన పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పెద్దగాని సోమయ్య, మహేష్ గౌడ్, లక్ష్మణ్ నాయక్, సందెల శ్రీనివాస్ పూర్ణచందర్, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కడెం యాకయ్య, ఎంపీటీసీ డొనక ఉప్పలయ్య కోరారు. గురువారం గ్రామంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శిక్షణ ప్రతినిధులు కొత్తురు సరస్వతి, ఐకేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా వెంకన్న

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రా మానికి చెందిన ధ ర్మారపు వెంకన్న ను బుధవారం హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ పార్టీ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా, సూర్యాపేట జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా నియమించినట్లు వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో నియమించినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మరిపెడకు కాంగ్రెస్ శ్రేణులు

డోర్నకల్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొనేందుకు గురువారం మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో మరిపెడకు తరలివెళ్లారు. డోర్నకల్ రైల్వేస్టేషన్ సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం: ఈనెల 12న జనగామ, పాలకుర్తి నుంచి ప్రారంభం కానున్న గ్రామపంచాయతీ సిబ్బంది పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను గురువారం స్థానిక గాంధీసెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొమురయ్య, శ్రావణ్, అక్బర్ పాల్గొన్నారు.

13న అప్రెంటీస్‌షిప్ మేళా

మహబూబాబాద్ అర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ఐటీఐ అన్ని ట్రేడ్‌లు పాసైన విద్యార్థులకు ఈ నెల 13న ఉదయం ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ గురువారం తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. అప్రెంటిస్‌షిప్ ఇండియా.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

స్ఫూర్తిగా తీసుకోవాలి

డోర్నకల్: తుమ్మ సత్తిరెడ్డి రైతాంగ పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టి వెంకన్న కోరారు. మండలంలోని పెరుమాళ్ల సంకీసలో గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో సత్తిరెడ్డి ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంగోత్ వెంకన్న, గండు రవి పాల్గొన్నారు.

ఊరేగింపు

మహబూబాబాద్ రూరల్ : శ్రీమహాగాయత్రి దేవి అమ్మవారు శ్రీవిశ్వకర్మ భగవాన్ స్వామివార్ల కల్యాణ మహోత్సవ అనంతర ఊరేగింపు గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో శోభాయమానంగా నిర్వహించారు. అర్చకులు జలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వాహనంపై అలంకరించిన వేదికలో స్వామివార్లను కొలువుదీర్చి ఊరేగింపు జరిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు 'సంకా'
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్ : రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్‌అర్బన్/నర్సింహులపేట/ కురవి/ పెద్దవంగర/తొర్రూరు/కేసముద్రం/డోర్నకల్: ఉపాధ్యాయుల సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకల నిర్వహించారు. స్థానిక విద్యాశాఖ కా ర్యాలయం ఎదుట, మండల కేంద్రాల్లో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సామ యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం సంఘ పతాకాన్ని ఆవి ష్కరించారు. అనంతరం సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించి సత్కరించారు. కార్యక్రమాల్లో ఆయా మండలశాఖ అధ్యక్షులు ఎర్ర పూర్ణచందర్, సూరం భాస్కర్, రాగిరి చంద్రశేఖర్, గొట్టిముక్కల శ్రీనివాస్‌రెడ్డి, జినుగ విప్లవ్‌రెడ్డి భీరం జనార్దన్‌రెడ్డి, ఉపా ధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగర : జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



దంతాలపల్లిలో..

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



మహబూబాబాద్ రూరల్ : సేవాలాల్ జయంతి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వెంకన్ననాయక్



మరిపెడ రూరల్ : నారాయణను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహబూబాబాద్ రూరల్ : సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దరావత్ వెంకన్న నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్వాడి సత్రంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోతు నందులాల్ నాయక్ అధ్యక్షతన గురువారం జరిగిన సంఘం సమావేశంలో ముఖ్య అతిథిగా వెంకన్ననాయక్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని 18 మండలాల్లో వేడుకలను నిర్వహించాలని అన్నారు. సమావేశంలో సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధరావత్ మోతిలాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బాదావత్ రాంబాబు నాయక్, మహిళా సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకావత్ పద్మ బాయి, జిల్లా అధికార ప్రతినిధి మాలోత్ సురేష్ నాయక్, పట్టణ అధ్యక్షులు బోడ దిలీప్ నాయక్, గౌరవ సలహాదారులు బానోతు దాము, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయాన్ని సందర్శించిన ఎన్ఆర్ఐ

మరిపెడ రూరల్ : మండలంలోని బోట్యాతండ పరిధిలోని గ్రామానికి చెందిన కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని రూ.కోటి నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయానికి ఇంగ్లాండ్ దేశంలో ఉంటున్న ప్రవాస భారతీయుడు గోవింద్‌సింగ్ పూజారి సంత్ బాబా నారాయణతో కలిసి వచ్చి గురువారం ఆలయ నిర్మాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాత, పూజారిని ఆలయ కమిటీ, తండావాసులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు భోజ్యానాయక్, రామకృష్ణ, శ్రీను, వినోద్‌కుమార్,చ ఉపసర్పంచ్ హైమాహరిలాల్, పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

డోర్నకల్/కురవి/దంతాలపల్లి: మండలంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కనకదుర్గ, శ్రీవీరభద్రస్వామి ఆలయచైర్మన్ రామునాయక్, సర్పంచ్ అల్లం కృష్ణ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చల్లగుండ్ల గణేష్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతమ్మ, వైద్యాధికా రులు అశోక్ కుమార్, స్రవంతి, వెంకన్న, ఉపసర్పంచ్ సత్తమ్మ, వైద్యులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



డోర్నకల్ : ప్రచారం చేస్తున్న వైద్యసిబ్బంది

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య



అచ్చమ్మ మృతదేహం

గార్ల: కడుపునొప్పి తాళలేక జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కోట్యానాయక్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం..మండలం కోట్యానాయక్‌తండాకు చెందిన భూక్యా అచ్చమ్మ(50) గత కొంత కాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. వైద్యం చేయించుకున్నా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పు రుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స జరిపిస్తుండగా మృతిచెందింది. మృతురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు ఎస్సై మృతురాలికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్ : బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లంను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని మహిళవరానికి చెందిన షేక్ అబ్దుల్, కురవి మండలం కంచర్లగూడెంకు చెందిన బానోత్ రమేష్ నల్లబెల్లంను రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకులకు తీవ్రగాయాలు

తొర్రూరు: రోడ్డు ప్రమాదంలో యువకులు తీవ్ర గాయాలపాలైన ఘటన గురువారం రాత్రి మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారి మడూరు శివారులోని సన్నూరు క్రాస్‌రోడ్డు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాయపర్తి మండలం మొరిపిరాల శివారు జానకమ్మ తండాకు చెందిన నవీన్, రాజు, విద్యానగర్ తండాకు చెందిన రాకేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు.


ఎంపీ, ఎమ్మెల్యేలు చీడపురుగులు

- కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్

మరిపెడ రూరల్: పేదల ఇళ్ల కూలుస్తూ, ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడుతున్న మనుకోట ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్‌లు జిల్లాకు పట్టిన చీడపురుగులని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ యాత్రలో భాగంగా మండల కేంద్రంలోని ఆర్లగడ్డతండ సమీపంలో బసకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌తో కలిసి బెల్లయ్యనాయక్ మాట్లాడారు. మహబూబాబాద్ ప్రాంతంలోని వందల ఎకరాలను కబ్జా చేసి వారి బినామీల పేరుపై నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ చేపట్టి భూ కబ్జాదారులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాటోతు రాంచంద్రునాయక్, నెహ్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఏటికి శ్రీరాంసాగర్ నీరు విడుదల చేయాలి

గార్ల: పాకాల ఏటికి శ్రీరాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేసి రైతుల వరిపంటను కాపాడాలని కోరుతూ గురువారం స్థానిక పాకాల ఏటి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సీపీఐ రాష్ట్ర నాయకులు, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పాకాల ఏటి పరివాహక ప్రాంత రైతులు గత నెల క్రితం వరకు ఏటిలో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయని వరిపంట సాగు చేశారన్నారు. నాట్లు వేసిన నెల రోజుల లోపే ఏటిలో నీళ్లు అడుగంటి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాగం లోకేష్, నాగేష్, సుధాకర్‌రెడ్డి, రమేష్, సైదులు, భద్రు, యశ్వంత్, పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తక్షణమే అరెస్ట్ చేయాలి

నర్సింహులపేట : దేవాదాయ ధర్మాదాయ పరిశీలకురాలు సమతపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బెల్లం వేణును తక్షణమే అరెస్ట్ చేయాలని మహబూబాబాద్ జిల్లా పరిశీలకులు నందనం కవిత డిమాండ్ చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తాం

డోర్నకల్ : మహబూబాబాద్ ఆర్‌టీసీ డిపో ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని మహబూబాబాద్ ఆర్‌టీసీ డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన బస్సుల్లో ప్రయాణిస్తున్న వారితో మాట్లాడారు. రైళ్లు లేని సమయంలో ఖమ్మం, మహబూబాబాద్‌లకు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరారు. మేనేజర్ ప్రయాణికుల సమయాలకు అనుకూలంగా నడుపుతామని చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక

కురవి : తులిస్యాతండా జీపీలో తెలంగాణ గిరిజన సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా నాయకుడు కిషన్‌నాయక్ గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా వెంకన్ననాయక్, కార్యదర్శిగా రాజానాయక్, సహాయ కార్యదర్శిగా వీరన్న, లింగన్న, ఉపాధ్యక్షులుగా రమేష్, కల్యాణ్‌ను ఎన్నుకున్నారు.

మా భూములు లాక్కోవద్దు



అధికారి కాళ్లు మొక్కుతున్న గిరిజన రైతులు

మహబూబాబాద్: మా భూములు లాక్కోవద్దంటూ బాధితులు ఎన్పీడీసీఎల్ సివిల్ అధికారుల కా ళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. గురువారం కలెక్టరేట్ రోడ్డులో సబ్‌స్టేషన్‌కు 30 గుంటల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారని ఎన్పీడీసీఎల్ సివిల్ ఏఈ శ్రీధర్‌రెడ్డితో పాటు సిబ్బంది ఆ స్థలం వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న రైతులు మూర్తి, రామూర్తి, అర్జున్, హరిసింగ్, కమ్లీ, సునీత, భారతి సరోజతో పాటు పలువురు వెళ్లి అధికారుల కాళ్లు పట్టుకుని తమ భూములను లాక్కోవద్దని ప్రాధేయపడ్డారు.సాలార్ తండాకు చెందిన రైతులు మాట్లాడుతూ గతంలోనే కలెక్టరేట్ నిర్మాణానికి, ఈవీఎం గోదాంకు, హరితహా రం పేరుతో తండాకు చెందిన చాలా మంది రైతుల భూములు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి కోసం భూమి తీసుకున్న స మయంలో మిగిలిన భూమి తీసుకోమని అధికారులు హామీ ఇచ్చి ఇలా చేయడం ఎంతవరకు సమజసమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఈ శ్రీధర్‌రెడ్డి సాక్షితో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం 30 గుంటల భూమిని కేటాయించి పత్రాలు అందచేశారన్నారు. ఈ రోజు ఆ భూమి సర్వే నిమిత్తం వెళ్లితే తమ భూమి అని గిరిజన రైతులు అడ్డుపడుతున్నారన్నారు. తమతో గొడవపడితే లాభం లేదని ఆ విషయాన్ని తహసీల్దార్, కలెక్టర్ వద్దకు వెళ్లి చెప్పుకోవాలే తప్పా తమతో వాగ్వాదం చేస్తే లాభం లేదని చెప్పానన్నారు. కార్యక్రమంలో సరోజ, కమ్లీ, మంగిలాల్, రమణ, రవి, శ్రీను, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లికుదురు: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్‌బాబు గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ యోగేశ్వరరావుకు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల వద్ద రెవెన్యూ అధికారులు నాటిన ప్రభుత్వ భూముల బోర్డులను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చిత్రీకరించి భూకబ్జాదారులు యధేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. 317 సర్వేనంబర్‌పై పూర్తి స్థాయిలో సర్వే చేయించి పట్టాగా మారిన 317లోని ప్రభుత్వ భూమి పట్టాను రద్దు చేసి పాత్రికేయులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇస్సంపల్లి సైదులు, ఎల్లయ్య, వాల్యా, రఘునాథ్, బిచ్చ, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లైమ్స్ పరిష్కరించాలి

నెహ్రూసెంటర్ : జిల్లాలో భవన నిర్మాణ కార్మికులకు 2018 నుంచి నేటి వరకు రావాల్సిన క్లైమ్స్‌ను కార్మికుల కుటుంబాలకు అందించి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన, మ్యారేజ్, మెట ర్నిటీ లబ్ధిని కార్మికులకు వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, శంకర్, అయిలయ్య, ప్రవీణ్, సురేష్, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

తపాలా శాఖలో విశేష సేవలు..

పెద్దవంగర: తపాలా సేవలను మారుమూల ప్రాంతాలకు విస్తరించామని దీని ద్వారా విశేష సేవలు అందిస్తున్నామని తపాలా శాఖ ఉమ్మడి వరంగల్ డివిజన్ సూపరింటెండెంట్ నర్సింహస్వామి తెలిపారు. గురువారం స్థానిక తపాలా కార్యాలయంలో బీపీఎంలతో సమావేశం నిర్వహించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో ఖాతాలను తీసుకొనేలా చొరవ తీసుకోవాలని బీపీఎంలకు సూచించారు.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

డోర్నకల్ : మున్సిపాలిటి పరిధిలోని వార్డుల్లో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 14వ వార్డుల్లో వసతుల కల్పనపై గురువారం స్థానికులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరించారు.

పోరాటాల ఫలితమే 'ఏసీడీ'ల రద్దు

నెహ్రూసెంటర్ : పేద ప్రజలకు భారంగా మారుతున్న ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి ఏసీడీ చార్జీలను రద్దు చేసిందని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి గురువారం తెలిపారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలను మోపొద్దని కోరారు.

ఐక్యంగా దేవునికి సేవ చేయాలి

కురవి : అందరు ఐక్యంగా ఉండి ఏసుప్రభు సేవ చేయాలని జీసస్ గ్రేస్ టైమ్స్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఖమ్మం జేసీటీఐఎం ఫౌండర్ పి.పీటర్ విజయ్ అన్నారు. మూడు రోజులపాటు మండల కేంద్రంలో జరిగిన సువార్త పండుగల చివరిరోజు గురువారం ఐక్యప్రార్థన చేశారు. .

పదోన్నతులు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఉపాధ్యాయులకు జీవో నంబర్ 3 ద్వారా 100 శాతం పదోన్నతులు కల్పించాలని టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ఈరు అన్నారు. డీఈఓ కార్యాలయంలో టీఎస్‌టీటీఎఫ్ జిల్లా నాయకులు డీఈఓ పి.రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: ప్రభుత్వం అంగన్‌వాడీలకు కల్పిస్తామన్న హక్కులను కల్పించాలని, లేబర్ యాక్ట్ ప్రకారం ఇవ్వాల్సిన గ్రాడ్యుటీ చెల్లించాలని అంగన్‌వాడీ సంఘం ప్రతినిధి తిరుపతమ్మ డిమాండ్ చేశారు. స్థానికి సీడీపీఓ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ పంటల పరిశీలన

గూడూరు : మండలంలోని మట్టెవాడ శివారు దొరవారితిమ్మాపురం గ్రామాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వ పథకాలు అందక, అభివృద్ధిలో వెనకబడ్డ గ్రామంగా పేరొందిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గుర్తించిన ఏఓ అల్లె రాకేష్ ఏఈఓ ద్వారా గ్రామాన్ని చేరుకొని రైతులతో పంటల సాగు విధానం తెలుసుకున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న, బొబ్బెర, పెసర పంటలు ఉన్నట్లుగా గుర్తించి మొక్కజొన్న పంటసాగుపై వారికి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వరి పంట సాగు, పలు రోగాలకు తీసుకునే మందుల గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అన్వేష్, వార్డుసభ్యులు మహేందర్, బుచ్చిరాములు, రైతులు పాల్గొన్నారు.

మేలుజాతి విత్తనాలతో అధిక దిగుబడులు



గార్ల : ప్రభుత్వ ఆమోదిత ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో నాణ్యమైన మిరప విత్తనాలు కొనుగోలు చేయడంతో రైతులు పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. గురువారం మండలం లోని అంగోత్ తండాలో రైతు అంగోత్ గోగ్యా విఘ్నేష్ హైబ్రీడ్ మిరప విత్తనాలతో సాగుచేసిన మిరపతోటలో అధికారులు, రైతులు క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ రకం మిరప విత్తనాలు సాగుచేసిన మిరపతోట ఎకరానికి 35 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు అధిక దిగుబడులు వచ్చే హైబ్రీడ్ వంగడాలు సాగు చేయాలని సూచించారు. క్షేత్ర ప్రదర్శన అనంతరం రైతు గోగ్యాకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ బోడ అనీల్, మాలోత్ రమేష్, పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

తొర్రూరు: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికబద్ధంగా లక్ష్యసాధనకు కృషి చేయాలని ఆర్డీఓ ఎల్.రమేష్ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో వెంటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్‌డే వేడుకలు నిర్వహించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

బయ్యారం: మండలంలోని గంధంపల్లిలో ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు.

'పది'లో ఉత్తమగ్రేడ్‌లు సాధించాలి

మహబూబాబాద్ రూరల్ : పదో తరగతి పరీక్షలు విద్యార్థులు ఉత్తమగ్రేడ్‌లు సాధించాలని రెడ్యాల ఏహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె.వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా అందజేసిన స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు.

అర్హులైన వారికి 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

బయ్యారం: మండలంలో అర్హులైన గిరిజన, గిరిజనేతరులందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలని సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బయ్యారంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కేసముద్రం: టీపీసీసీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం కేసముద్రం, ఇనుగుర్తి ప్రధాన సెంటర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలకు నిప్పంటించి దహనం చేశా రు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.

నెల్లికుదురు: మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్‌పై వ్యక్తిగత దూషణలకు దిగితే ఎవరైనా సరే ప్రతిఘటన తప్పదని జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నర్సింహులపేట/మరిపెడ రూరల్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర డోర్నకల్ నియోజకవర్గంలో గురువారం సాగింది. ఈ క్రమంలో నర్సింహులపేట, మరిపెడ మండలాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల, వృత్తి సంఘాల నాయకులు సమస్యలు పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని భాషాపండిట్‌ల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. చెరువులపై చేపలు పట్టుకునే హక్కు బెస్త, ముదిరాజ్ కులస్తులకే ఉండాలని మత్స్య సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం..

తనకు 90శాతం అంగవైకల్యం ఉన్నా.. ఎన్నిసార్లు అధికారులకు అర్జీలు పెట్టుకున్నా.. పింఛన్ ఇవ్వడం లేదని స్టేజీతండాకు చెందిన దివ్యాంగుడు భూక్యా బాలు తమ అంగవైకల్యం, తన వద్ద ఉన్న సర్టిఫికెట్లను చూపించాడు. చలించిన రేవంత్‌రెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఆలయంలో గణపతి యజ్ఞం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో గురువారం శ్రీమహాలక్ష్మీగణపతి స్వామివారి యజ్ఞం ఆలయ అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లోకకల్యాణార్థం భక్తులందరి క్షేమం కోరి సంకష్టహర చతుర్థి సందర్భంగా శ్రీమహాలక్ష్మీ గణపతి స్వామి వారి యజ్ఞం పూజా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో యందూరి లక్ష్మణ్‌రావు, డాక్టర్ బొడ్ల మధుసూధన్‌రావు, ఒబిలిశెట్టి నర్సింహస్వామి పాల్గొన్నారు.